GSTIN-NO:36FKPSI308PIZX
epaper:tmedia.net.in

# టి-మీడియా

సామాజికం... ప్రజల పక్షం

మెయిన్ : బుధవారం- జనవరి 31-2024 పేజీలు : 2

## మహాత్మ గాంధీ కీ సీఎం రేవంత్ నివాళి



టి మీడియా, జనవరి 30, హైదరాబాద్ :
మహాత్మా గాంధీ వర్ధంతి సందర్భంగా హైదరాబాద్, బాపూఘాట్ లో నివాళులు అర్పించిన ముఖ్యమంత్రి శ్రీ రేవంత్ రెడ్డి . ఈ కార్యక్రమంలో పాల్గొన్న ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శ్రీమతి శాంతి కుమారి తదితరులుపాల్గొన్నారు.



# తాగునీటి నిర్వహణ పంచాయతీ లకే

- నియోజకవర్గానికీ రూ.కోటి
- కృష్ణా గోదావరితో పాటు కొత్త ప్రాజెక్టుల వినియోగం
- రోడ్లు లేని 422 గ్రామాలు, 3,177 ఆవాసాలకు తారు రోడ్లు
- స్వయం సహాయక సంఘాలకు చేయూతగా కొత్త కార్యక్రమాలు
- పంచాయతీరాజ్ సమీక్షలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

**టి మీడియా, జనవరి 30, హైదరాబాద్ :** గ్రామాల్లో తాగునీటి నిర్వహణ విధులను సర్పంచులకు అప్పగించాలని ముఖ్యమంత్రి సూచించారు. ఇంటింటికీ నీళ్లను అందించే బాధ్యతను వాళ్లకే ఇవ్వాలని అన్నారు. అందుకు అవసరమైన విధి విధానాలు రూపొందించాలని సూచించారు. గ్రామాల వరకు రక్షిత మంచి నీటిని సరఫరా చేసే బాధ్యతను మిషన్ భగీరథ విభాగమే తీసుకోవాలని సూచించారు. గ్రామాల్లో తాగునీటి నిర్వహణ, నల్లాలు, పైపులైన్ల మెయింటెనెన్స్ మాత్రమే విడిగా సర్పంచులకే అప్పగించాలని చెప్పారు. ఇప్పటివరకు మిషన్ భగీరథలో చేపట్టిన ఇంట్రా విలేజ్ వర్క్స్, ఇంటింటికీ నల్లా నీటిని సరఫరా చేసే నిర్వహణ ఎవరూ పట్టించుకోవటం లేదని ముఖ్యమంత్రి అన్నారు. గ్రామాల్లో తాగునీటి నిర్వహణ అంశం ఎవరి పరిధిలో లేదని అధికారులు వివరణ ఇచ్చారు. జవాబుదారీతనం లేకపోతే గ్రామాల్లో తాగునీటి సమస్య పెరిగిపోతుందని సీఎం అన్నారు.

వందకు వంద శాతం తెలంగాణలో ఇంటింటికీ నల్లా నీళ్లు ఇచ్చినట్లు గత ప్రభుత్వం చెప్పుకోవటంతో నష్టమే తప్ప లాభం లేకుండా పోయిందని ముఖ్యమంత్రి అన్నారు. దీంతో కేంద్రం నుంచి తెచ్చుకునేందుకు వీలున్న జల జీవన్ మిషన్ నిధులు రాకుండా పోయాయని అన్నారు. అందుకే వాస్తవాలను దాచిపెట్టి గొప్పలకు పోవాల్సిన అవసరం లేదని అధికారులను అప్రమత్తం చేశారు. ఇప్పటికీ రాష్ట్రంలో చాలాచోట్ల తాగునీటికి ప్రజలు ఇబ్బంది పడుతున్నారని, తండాలు, గూడెలు, అటవీ గ్రామాలకు నీళ్లు అందటం లేదని అన్నారు. ఎన్నికలప్పుడు తాను ఖానాపూర్ కు వెళితే తాగునీటికి ఇబ్బంది పడుతున్నట్లు చాలా గ్రామాల ప్రజలు తన దృష్టికి తెచ్చిన విషయం గుర్తు చేశారు.

**రాష్ట్రంలో వచ్చే వేసవిలో తాగునీటి ఎద్దడి తలెత్తకుండా ఇప్పటి నుంచే ప్రణాళికలు రూపొందించుకోవాలని ముఖ్యమంత్రి శ్రీ ఏ. రేవంత్ రెడ్డి ఆదేశించారు. కేవలం గోదావరి, కృష్ణా నదుల నుంచే రాష్ట్రమంతటికీ నీళ్లు ఇవ్వటం కాకుండా, కొత్తగా ఏర్పడ్డ రిజర్వాయర్లను తాగునీటి అవసరాలకు వినియోగించుకోవాలని ముఖ్యమంత్రి సూచించారు. అందుకు అనుగుణంగా కొత్త ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ముఖ్యమంత్రి సూచించారు. దీంతో చుట్టుపక్కల ఉన్న గ్రామాలకు తాగు నీటిని సరఫరా చేయటం సులభమవుతుందని, తక్కువ ఖర్చుతో సాధ్యమవుతుందని అన్నారు. మల్లన్నసాగర్, కొండపోచమ్మసాగర్, రంగనాయక్ సాగర్ లాంటి కొత్తగా ఏర్పడ్డ రిజర్వాయర్లన్నింటినీ తాగునీటికి వాడుకోవాలని అన్నారు. ఈరోజు డా. బి.ఆర్. అంబేద్కర్ తెలంగాణ రాష్ట్ర సచివాలయంలో ముఖ్యమంత్రి శ్రీ ఏ. రేవంత్ రెడ్డి పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి విభాగాలపై సమీక్ష నిర్వహించారు.**

రాష్ట్రంలో ఏయే ప్రాంతాలకు, ఎన్ని హాబిటేషన్లకు తాగునీరు అందటం లేదో సమగ్రంగా సర్వే చేయాలని సీఎం అధికారులను ఆదేశించారు. నెలాఖరుతో సర్పంచుల పదవీకాలం ముగిసిపోతుందని, అధికారులే తాగునీటి బాధ్యతలను సమర్థంగా నిర్వహించాలని చెప్పారు. సంబంధిత ఇంజనీర్లు అన్ని గ్రామాలకు వెళ్లి నిజ నిర్ధారణ బృందం చేసినట్లుగానే పక్కాగా తాగునీరు అందని హాబిటేషన్ల జాబితాను సిద్ధం చేయాలని సూచించారు. జలజీవన్ మిషన్ నిధులు రాబట్టుకునేలా కొత్త ప్రతిపాదనలు తయారు చేసి కేంద్రానికి పంపించాలని అన్నారు.

వేసవిలో నీటి ఎద్దడి తలెత్తకుండా ఇప్పటి నుంచే అన్ని చర్యలు చేపట్టాలని సూచించారు. ప్రతి అసెంబ్లీ నియోజకవర్గానికి స్పెషల్ డెవెలప్మెంట్ ఫండ్ కింద కేటాయించిన రూ.10 కోట్లలో ఒక కోటి రూపాయలను తాగునీటి అవసరాలకు ఖర్చు చేయాలని ఆదేశించారు. రాష్ట్రంలో ఉన్న అన్ని ప్రాజెక్టులు, రిజర్వాయర్లలో లభ్యమయ్యే నీటిని ప్రజల తాగునీటి అవసరాలకే మొదటి ప్రాధాన్యంగా అందించాలని స్పష్టం చేశారు.

రాష్ట్రంలో ఉన్న స్వయం సహాయక సంఘాలను బలోపేతం చేయాలని, వాళ్లకు ఆర్థికంగా చేయూతను అందించే కార్యక్రమాలపై దృష్టి పెట్టాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. ప్రభుత్వ స్కూళ్లు, గురుకులాలు, హాస్టళ్ల విద్యార్థిని విద్యార్థులు, పోలీసులకు అందించే యూనిఫారాలు కుట్టించే పనిని ఈ సంఘాల మహిళలకు అప్పగించాలని సూచించారు. అవసరమైతే తగిన శిక్షణను ఇచ్చి వారిని ప్రోత్సహించాలని, అందుకు అవసరమైన ఏర్పాట్లు చేయాలని చెప్పారు.

రాష్ట్రంలో ఇప్పటికీ రోడ్డు కనెక్టివిటీ లేని గ్రామాలు, హాబిటేషన్లకు రోడ్లను నిర్మించాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. 422 గ్రామ పంచాయతీలు, 3,177 ఆవాసాలకు ఇప్పటికీ రోడ్డు కనెక్టివిటీ లేదని అధికారులు సీఎం నివేదించారు. వీటన్నింటికీ తారు రోడ్లు వేయాలని సీఎం ఆదేశించారు. అవసరమైతే ఉపాధి హామీ నిధులను లింక్ చేసి వీటిని పూర్తి చేయాలని చెప్పారు. ఈ బడ్జెట్లోనే అందుకు అవసరమైన నిధులకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని సూచించారు. సీఎంతో పాటు ఈ సమావేశంలో పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్క గారు, రోడ్లు భవనాల శాఖ మంత్రి శ్రీ కోమటిరెడ్డి వెంకటరెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శ్రీమతి శాంతి కుమారి, సంబంధిత విభాగాల అధికారులు పాల్గొన్నారు.

# అప్పుల ఊబిలో రాష్ట్రం..

### పుట్టబోయే బిడ్డపైనా అప్పుల భారం..'
### బీఆర్ఎస్‌పై డిప్యూటీ సీఎం ఫైర్..



**టీ మీడియా, జనవరి 30, హైదరాబాద్:** ఇంటికో ఉద్యోగం, ఊరికో బడి, కేజీ టూ పీజీ, మూడు ఎకరాల భూ పంపిణీ, దళిత సీఎం, డబుల్ బెడ్‌రూమ్ ఇండ్లు కట్టిస్తామని వాగ్దానాలు చేసి 10 సంవత్సరాలు అధికారంలో ఉండి అమలు చేయకుండా ప్రజలను మోసం చేసిన గత బీఆర్ఎస్ పాలకులు.. నలభై రోజులు నిండని కాంగ్రెస్ ప్రభుత్వంపై గ్యారెంటీలు అమలు చేయడం లేదంటూ నోటికి వచ్చినట్టు మాట్లాడటానికి సిగ్గుందా.? బుద్ధి ఉందా.? అంటూ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మండిపడ్డారు. మంగళవారం కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ నియోజకవర్గ బూత్ కమిటీ సమావేశానికి హాజరైన డిప్యూటీ సీఎం.. బీఆర్ఎస్‌పై నిప్పులు చెరిగారు.

రాష్ట్ర సంపదను, వనరులను దోపిడీ చేసిన గత బీఆర్ఎస్ పాలకులు రాష్ట్రాన్ని అప్పుల ఊబిలోకి నెట్టేసి పుట్టబోయే బిడ్డపై కూడా అప్పుల భారం మోపారని దుయ్యబట్టారు. పదేళ్ల పరిపాలనలో గత బీఆర్ఎస్ పాలకులు చేసిన దోపిడిని లెక్కలతో సహా బయటపెట్టి వారిని ప్రజల ముందు దోషులుగా నిలబెడుతామన్నారు. గత కాంగ్రెస్ ప్రభుత్వ హాయంలో హైదరాబాద్‌లో సృష్టించిన ఆస్తులను గత బీఆర్ఎస్ పాలకులు అమ్ముకుని బతికిరాని, హైదరాబాద్ అభివృద్ధికి వారు చేసింది ఏమిలేదని విమర్శించారు. మాట్లడటానికి కూడా హక్కు లేకుండా చేసిన బీఆర్ఎస్ సర్కార్‌ను బంగాళాఖాతంలో పడేసి ఇందిరమ్మ రాజ్యం తెచ్చుకున్న ప్రజల కలలను నిజం చేస్తామన్నారు. రాష్ట్ర సంపదను ప్రజలకు పంచుతామని, ఆత్మగౌరవం, స్వేచ్ఛ, స్వాతంత్ర్యంతో బతకడానికి కావాల్సిన వాతావరణం కల్పిస్తామన్నారు.

### డ్రగ్స్ ఫ్రీ నగరంగా మార్చడమే లక్ష్యం..

డ్రగ్స్ ఫ్రీ నగరంగా హైదరాబాద్‌ను మార్చడమే ఇందిరమ్మ రాజ్యం లక్ష్యమన్నారు. రాష్ట్రంలో క్లీన్ అండ్ గ్రీన్ పరిపాలన అందిస్తామని, ఇందిరమ్మ రాజ్యంలో అభివృద్ధి సంక్షేమమే తప్ప.. డ్రగ్స్ ఉండదన్న భరోసా హైదరాబాద్ ప్రజలకు కల్పించాలన్నారు. హైదరాబాద్ పబ్బుల్లో డ్రగ్స్ విక్రయాలకు చోటు లేదని, నియంత్రణకు కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటున్నట్టు చెప్పారు. ప్రాంతాలు, మతాల పేరిట విభజన చేసి ప్రజలను రెచ్చగొట్టి శాంతిభద్రతలకు విఘాతం కలిగించేవారి పట్ల ఉపేక్షించమన్నారు. అనేక మతాలు, కులాల ప్రజలను కడుపులో పెట్టుకుని అందరినీ సమానంగా చూస్తామన్నారు. ప్రతి పౌరుడికి రక్షణ కల్పించడమే ఇందిరమ్మ రాజ్యంలోని కాంగ్రెస్ ప్రభుత్వం పని చేస్తుందన్నారు. రాష్ట్రంలో ప్రజల ధన, మాణ, ప్రాణాలను కాపాడడానికి పోలీస్ వ్యవస్థను పటిష్ట పరిచామన్నారు. పోలీస్, రెవిన్యూ, హెల్త్, సివిల్ సప్లై, జీహెచ్ఎంసీ అన్ని వ్యవస్థలను ప్రజలకు జవాబుదారీగా పని చేయిస్తామన్నారు. ఈ వ్యవస్థలు, సంస్థలు తమ కోసమే ఏర్పాటు చేశారన్న భావన కల్పించే విధంగా ప్రజాపాలన ఉంటుందన్నారు. హైదరాబాద్ డ్రైనేజీ వ్యవస్థను మెరుగుపర్చడం, మూసీ నది ప్రక్షాళనతో పాటు సుందరీకరణ చేసి హైదరాబాద్‌ను అందమైన సిటీగా అభివృద్ధి చేయడానికి ప్రణాళికలు తయారు చేశామని, ప్రణాళిక బద్దంగా హైదరాబాద్ అభివృద్ధి జరుగుతుందన్నారు.

### రాహుల్ సందేశాన్ని గడప గడపకు తీసుకెళ్లాలి..

దేశాన్ని ఏకం చేయడానికి, ప్రజాస్వామ్యాన్ని, లౌకికవాదాన్ని కాపాడటం కోసం కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ చేపట్టిన భారత్ జోడో న్యాయయాత్ర సందేశాన్ని గడప గడపకు తీసుకెళ్లాలని కాంగ్రెస్ శ్రేణులకు పిలుపునిచ్చారు. దేశ సంపద ఈ ప్రజలకే చెందాలని రాహుల్ గాంధీ చేస్తున్న పాదయాత్రను విజయవంతం చేయాలని కోరారు. లౌకికవాదం కలిగిన ఈ దేశంలో పుట్టిన ప్రతి బిడ్డ.. ఇక్కడి బిడ్డనేనని మతం పేరిట విభజన చేయడం తగదన్నారు. మత విభజన పేరిట వైశ్యామ్యాలను సృష్టించి రాజకీయ లబ్ధి పొందాలని చూస్తున్న పార్టీలను పార్లమెంటు ఎన్నికల్లో దూరం పెట్టాలని ప్రజలకు విజప్తి చేశారు. ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన మాటను నిజం చేస్తున్నామని, అసెంబ్లీలో ఎమ్మెల్యేలు ప్రమాణం చేసిన రెండు గంటల వ్యవధిలోనే మహాలక్ష్మీ పథకంలో భాగంగా మహిళలకు ఉచిత ఆర్టీసీ బస్సు పథకాన్ని ప్రారంభించామన్నారు. రాజీవ్ ఆరోగ్య శ్రీ సాయాన్ని రూ.10లక్షలకు పెంచామన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 10.50 కోట్ల మంది మహిళలు ఉచిత ఆర్టీసీ బస్సు ప్రయాణాన్ని సద్వినియోగం చేసుకున్నారని తెలిపారు. వచ్చే నెలలో మరో రెండు పథకాలు ప్రారంభిస్తామని వెల్లడించారు. ప్రభుత్వానికి ప్రజల మధ్యన కాంగ్రెస్ పార్టీ శ్రేణులు వారధులుగా పని చేసి ఆరు గ్యారెంటీలు ప్రజలకు అందేలా చూడాలన్నారు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క.

# మహాత్మాగాంధీకి సీఎం జగన్ నివాళి



**టీ మీడియా, జనవరి 30, అమరావతి:** నేడు మహాత్మాగాంధీ వర్ధంతి. ఈ సందర్భంగా రాజకీయ నాయకులంతా ఆయనకు నివాళులు అర్పిస్తున్నారు. ఏపీ సీఎం జగన్మోహన్ రెడ్డి సైతం మహాత్ముని వర్ధంతి సందర్భంగా నివాళులు అర్పించారు. మహాత్ముడు కలలుగన్న గ్రామ స్వరాజ్యాన్ని తన ప్రభుత్వంలో సచివాలయ వ్యవస్థ ద్వారా సాకారం చేశానంటూ ఎక్స్ వేదికగా వెల్లడించారు. “సత్యం, అహింస తన ఆయుధాలుగా స్వతంత్ర పోరాటం చేసి, జాతిపితగా నిలిచారు మహాత్మా గాంధీ గారు. ఆయన కలలుగన్న గ్రామ స్వరాజ్యాన్ని మన ప్రభుత్వంలో గ్రామ సచివాలయ వ్యవస్థ ద్వారా సాకారం చేశాం. నేడు ఆయన వర్ధంతి సందర్భంగా ఘనంగా నివాళులు అర్పిస్తున్నాను” అని జగన్ పేర్కొన్నారు.



## బయటపడిన
# నటి డ్రగ్స్ దందా..

**టీ మీడియా, జనవరి 30, హైదరాబాద్:** నగర శివారు నార్సింగిలో వెలుగులోకి వచ్చిన డ్రగ్స్ కేసులో పలు వివరాలను పోలీసులు సేకరించారు. నిందితురాలు లావణ్య (34) విజయవాడ నుంచి ఉన్నత చదువుల కోసం హైదరాబాద్ వచ్చినట్లు గుర్తించారు. సంగీతం టీచర్‌గా పని చేస్తూ లఘు చిత్రాల్లో నటించేవారని రిమాండ్ రిపోర్టులో పోలీసులు పేర్కొన్నారు. షార్ట్ ఫిల్మ్స్‌లో నటించే సమయంలో జల్సాలకు అలవాటుపడి డ్రగ్స్ దందా మొదలు పెట్టారని తెలిపారు. కోకాపేటలో నివాసముంటున్న లావణ్య కొన్నాళ్లుగా డ్రగ్స్ దందా చేస్తున్నట్టు మాదాపూర్ ఎస్‌వోటీ పోలీసులకు సమాచారం అందడంతో ఆదివారం సాయంత్రం శంకర్‌పల్లి-నార్సింగి రహదారిలో ఆమెను అదుపులోకి తీసుకున్నారు. తనిఖీ చేయగా ఆమె వద్ద 4 గ్రాముల ఎండీఎంఏ లభించింది. ఆమె కొన్నిరోజులుగా డ్రగ్స్ వినియోగిస్తున్నట్టు ప్రాథమికంగా గుర్తించారు. దీంతో పరిచయస్థుడైన ఉనీత్‌రెడ్డి ఎండీఎంఏను తన బ్యాగులో వేశాడని ఆమె చెప్పారు. అతడు గతంలో డ్రగ్స్ వినియోగిస్తూ మోకిల పోలీసులకు చిక్కాడు. ఆ తర్వాత విక్రేతగా మారి సరఫరా చేస్తున్నట్టు గుర్తించారు. ఉనీత్‌రెడ్డితో పాటు ఇందూ అనే మరో మహిళ పరారీలో ఉన్నారు.

# నేటి తో ముగియనున్న సర్పంచుల పదవీకాలం

- అప్పులు తెచ్చి అభివృద్ధి పనులు
- కోట్ల రూపాయిలు బిల్లులు పెండింగ్



**టీ మీడియా, జనవరి 30, హైదరాబాద్:** జనవరి 31న సర్పంచ్?ల పదవికాలం ముగుస్తుంది. ఇక పాలనను అధికారులకి అప్పగిస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకోనుంది. ఎన్నికల షెడ్యూల్ వచ్చే వరకు తమనే పదవిలో కొనసాగించాలంటూ సర్పంచులు కోరుకుంటున్నారు. అయితే పొడిగింపుపై ప్రభుత్వం ససేమిరా అంటోంది. గత ప్రభుత్వం హయంలో సకాలంలో నిధులు రాకపోవడంతో గ్రామపంచాయతీలు అప్పుల కుప్పలాగా మారిపోయాయి. దీంతో పెండింగ్‌లో ఉన్న బిల్లులతో పాటు తమ పదవిని పొడిగించాలన్న డిమాండ్ చేస్తున్నారు సర్పంచులు. మరికొద్ది గంటలలో సర్పంచులు, మాజీ సర్పంచులుగా మారనున్నారు. ఈ ఐదేళ్లలో సర్పంచులకి సరిగా నిధులు రాకున్నా ప్రభుత్వం హడవుడి చేసింది. దీంతో చాల మంది సర్పంచులు అప్పులు తెచ్చి అభివృద్ధి పనులు చేసారు. ముఖ్యంగా నూతన గ్రామ పంచాయతీల నిర్మాణం, శ్మశాన వాటిక, ప్రకృతి వనంలాంటి కార్యక్రమాలని టార్గట్?గా పెట్టింది అప్పటి ప్రభుత్వం. చాల మంది సర్పంచులు స్వయంగా ఈ పనులను చేసారు. కాని బిల్లుల మంజూరులో తీవ్ర జాప్యం జరుగుతోంది. గత ప్రభుత్వ హాయంలో అధికార పార్టీకి చెందిన సర్పంచులే ఆందోళనకి దిగారు. కొందరు సర్పంచులు ఆత్మహత్యలు చేసుకున్న సందర్భాలు ఉన్నాయి. ఆస్తులు అమ్మి అభివృద్ధి పనులు చేసిన సర్పంచ్?లు కుడా ఉన్నారు. దీనికి తొడు రెండేళ్ళు కరోనా కారణంగా శానిటేషన్ ఇతర పరిశుభ్రత కోసం గ్రామ పంచాయతీ ప్రత్యేక దృష్టి పెట్టింది. ఆ నిధులు కూడా సరిగా మంజూరు కాలేదు. దీంతో సర్పంచులే ఏదోవిధంగా నిధులని సమకూర్చుకున్నారు.

కాంగ్రెస్ ప్రభుత్వం ఎర్పడిన తరువాత సర్పంచ్?ల సమస్యలపై కేటీఆర్ నిలదీశారు. అయితే కేటీఆర్?కి కౌంటర్?గా కాంగ్రెస్?తో పాటు, బీజేపీ కుడా స్పందించింది. గత ప్రభుత్వం హయంలో చేసిన తప్పుల కారణంగానే గ్రామ పంచాయతీలు ఆర్థిక సంక్షోభంతో కొట్టుమిట్టాడాయని ఆరోపించింది. ఈ పదిహేను రోజులు అధికార, ప్రతిపక్ష పార్టీల సర్పంచుల సమస్యలపైనే వాదనలు వినిపిస్తున్నాయి. ఫిబ్రవరి ఒకటి నుండి స్పెషల్ ఆఫీసర్ల పాలన కొనసాగుతుందని ప్రభుత్వం ఇప్పటికే ప్రతిపాదించినది. పార్టీలకతీతంగా సర్పంచ్?లు మాత్రం తమపదవి కాలాన్ని పొడగించాలని డిమాండ్ చేస్తున్నారు. లేదంటే పెండింగ్‌లో ఉన్న బిల్లులు మంజూరు చేసిన తరువాతనే స్పెషల్ ఆఫీసర్ల పాలన కొనసాగించాలని కోరుతున్నారు.

# బిజెపి నేత హత్య : 15 మందికి ఉరి శిక్ష



**టీ మీడియా, జనవరి 30, కేరళ :** కేరళ లో రెండేళ్ల క్రితం సంచలనం సృష్టించిన బిజెపి నాయకుడి హత్య కేసులో అలప్పుళ కోర్టు సంచలన తీర్పు వెలువరించింది.. ఈ కేసులో దోషులుగా తేలిన 15 మందికి మరణశిక్ష విధించింది. దోషులందరూ నిషేధిత పీఎఫ్ఐ సంస్థకు చెందిన వారు.. ఒక కేసులో ఇంత ఎక్కువ మందికి మరణశిక్ష విధించడం కేరళ చరిత్రలోనే ఇదే తొలిసారి. నిందితుల్లో 8 మందిపై హత్య అభియోగాలు, మిగతా వారిపై కుట్ర ఆరోపణలు రుజువైనట్లు కోర్టు తెలిపింది. వీరంతా శిక్షణ పొందిన కిల్లర్ స్క్వాడ్ అని, బిజెపి నేతను ఆయన కుటుంబం కళ్లముందే అతి దారుణంగా చంపేశారని ప్రాసిక్యూషన్ పేర్కొంది. అత్యంత క్రూరమైన నేరంగా దీన్ని పరిగణించి దోషులకు గరిష్ఠ శిక్ష విధించాలని న్యాయస్థానాన్ని కోరింది. వాదనలు విన్న ధర్మాసనం.. దోషులకు మరణశిక్ష విధిస్తూ తీర్పు వెలువరించింది. కేసు వివరాలలోకి వెళితే %ా% 2021 డిసెంబరు 19న అలప్పుళ లో బిజెపి ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యదర్శి రంజిత్ శ్రీనివాసన్‌ను హత్య చేశారు. పీఎఫ్ఐ, ఎస్‌డీపీఐ కార్యకర్తలు అతని ఇంట్లోకి చొరబడి అతడిని కుటుంబ సభ్యుల ఎదుటే అత్యంత పాశవికంగా చంపేశారు. ఈ ఘటనపై దర్యాప్తు చేపట్టిన పోలీసులు కొందర్ని అరెస్టు చేశారు. దీనిపై విచారణ జరిపిన అదనపు సెషన్స్ కోర్టు ఈ కేసులో 15 మందిని దోషులుగా నిర్ధారించింది. కాగా, అదే ఏడాది ఏడాది డిసెంబరు 18న సోషల్ డెమోక్రటిక్ పార్టీ ఆఫ్ ఇండియా (ఎస్‌డీపీఐ) నాయకుడు కేఎస్ షాన్ ఇంటికి తిరిగి వస్తుండగా గుర్తు తెలియని వ్యక్తుల హత్య చేశారు.. దీనికి ప్రతికారంగానే కొద్ది గంటలకే రంజిత్ హత్య చేశారు పీఎఫ్ఐ, ఎస్‌డీపీఐ కార్యకర్తలు.

# తెలంగాణా వాణి ని బలంగా వినిపించాం

- విభజన హామీలు అమలు చేయాలి -కేశవరావు, నామ నాగేశ్వరరావు



**టీ మీడియా, జనవరి 30, న్యూఢిల్లీ :** పార్లమెంట్ బడ్జెట్ సమావేశాలు ప్రారంభం కానున్న నేపథ్యంలో మంగళవారం న్యూఢిల్లీలోని పార్లమెంట్ లైబ్రరీ భవనంలో కేంద్ర ప్రభుత్వం అఖిల పక్ష సమావేశం నిర్వహించింది. ఈ సమావేశంలో బీఆర్ఎస్ పార్టీ తరపున పార్టీ పార్లమెంటరీ నేత కే. కేశవరావు , లోక్ సభా పక్ష నేత, ఖమ్మం పార్లమెంట్ సభ్యులు నామ నాగేశ్వరరావు పాల్గొని, కేంద్ర ప్రభుత్వానికి పలు సూచనలు చేయడంతో పాటు తెలంగాణా కు సంబంధించిన పెండింగ్ అంశాలపై గళం విప్పారు. ఈ సందర్భంగా ఎంపీ నామ మాట్లాడుతూ విభజన హామీలను అమలు చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరినట్లు చెప్పారు. కేంద్రం వద్ద ఎన్నో పెండింగ్ సమస్యలున్నాయని, వాటిపై ప్రతి లోక్ సభ సమావేశాల్లో ను ప్రస్తావించి, తెలంగాణా వాణిని ఎంతో బలంగా వినిపించామని చెప్పారు. బయ్యారం ఉక్కు కర్మాగారం, ఖాజీపేట రైల్వే కోచ్ ఫ్యాక్టరీ, పెండింగ్ నిధులు, ప్రాజెక్టులు తదితర అన్ని పెండింగ్ అంశాలపై పెద్ద ఎత్తున పోరాటం చేశామని నామ తెలిపారు. ఈ చివరి సమావేశాల్లో కూడా పెండింగ్ సమస్యలపై తమ గళాన్ని మరింత బలంగా వినిపిస్తామని నామ నాగేశ్వరరావు, కేశవరావు స్పష్టం చేశారు.

